## క్లుప్తంగా

### ఉత్సాహంగా ముగ్గుల పోటీలు



మొగల్తూరు కెనాల్ రోడ్డులో ముగ్గులు వేస్తున్న మహిళలు

మొగల్తూరు: మొగల్తూరు సత్తెమ్మ అమ్మవారి జాతర సందర్భంగా శనివారం ముగ్గుల పోటీలు నిర్వహించారు. ప్రతి మూడు సంవత్సరాలకు ఒకసారి అమ్మవారి జాతరను ఘనంగా నిర్వహిస్తారు. ఈ నేపథ్యంలో ఆదివారం రాత్రి అమ్మవారి జాతర నిర్వహించనున్నారు.

### పుష్పరాజ్‌కు దళితరత్న అవార్డు



నన్నేటి పుష్పరాజ్

పెనుగొండ: రాష్ట్ర మాల మహానాడు అధ్యక్షుడు నన్నేటి పుష్పరాజ్‌ను ఏలూరు గౌతమి బుద్ధ ప్రచార్ ట్రస్ట్ దళిత రత్న అవార్డుకు ఎంపిక చేశారు. ఈ మేరకు పుష్పరాజ్ ఆచంట వేమవరంలో శనివారం విలేకరులతో మాట్లాడుతూ ఆదివారం ఏలూరులోని వైఎం హెచ్ఏ హాలులో జరగనున్న సమావేశంలో అవార్డు అందించనున్నట్లు సంస్థ ఛైర్మన్ మంచేళ్ల ఇస్సాక్ సమాచారం అందించారని తెలిపారు. అవార్డుకు ఎంపికైన పుష్పరాజ్‌ను రాష్ట్ర కార్యదర్శి నంది జయరాజు, జిల్లా అధ్యక్షుడు నేతల సువర్ణరాజు, జిల్లా ప్రధాన కార్యదర్శి కొలాటి ప్రసాద్‌రావు, చిల్లే రాజ్‌కుమార్, చిగురుపాటి రాజేష్, నేతల సాల్మన్ రాజు, పిట్టా వినోద్ కుమార్, తొర్లపాటి భాగ్యరాజు, నన్నేటి కిరణ్ తదితరులు అభినందించారు.

### రాష్ట్ర ఆర్యవైశ్య కార్యవర్గ సభ్యుడిగా రేపాక



నియామకపత్రం అందుకుంటున్న ప్రవీణ్ భాను

పాలకొల్లు సెంట్రల్: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఆర్యవైశ్య మహాసభ కార్యవర్గ సభ్యుడిగా పట్టణానికి చెందిన రేపాక నాగ వెంకట రత్న ప్రవీణ్ భాను, దక్షిణ ఆంధ్ర జోన్ ఆర్గనైజర్‌గా మాటూరి వీర వెంకట నర్సింహమూర్తిలు ఎంపికయ్యారు. శనివారం రాష్ట్ర ఆర్యవైశ్య మహాసభ అధ్యక్షుడు చిన్ని రామసత్యనారాయణ నియామక పత్రాలు అందించినట్లు తెలిపారు. ఈ నెల 26న గుంటూరులో ప్రమాణ స్వీకారం ఉంటుందని పేర్కొన్నారు.

### దొంగతనాలపై అప్రమత్తంగా ఉండాలి

భీమవరం: రైళ్లలో ప్రయాణించేటప్పుడు దొంగతనాల పట్ల అప్రమత్తంగా ఉండాలని ఆర్‌పీఎఫ్ ఏఎస్సై వెంకటేశ్వరరావు అన్నారు. స్థానిక శ్రీ ఆదిత్య డిగ్రీ కాలేజ్‌లో రైళ్లల్లో ప్రయాణించేటపుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. మాదక ద్రవ్యాలకు, చెడు అలవాట్లకు, అపరిచిత వ్యక్తులకు దూరంగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో ఆర్‌పీఎఫ్ హెడ్ కానిస్టేబుల్ వీబీఎస్ రెడ్డి, కళాశాల డైరెక్టర్ ఎం శ్రీనివాస్, ప్రిన్సిపాల్ ఎ.అనురాధ, వైస్ ప్రిన్సిపాల్ మావుళ్లు, ఎన్ఎస్ఎస్ ఆఫీసర్ బ్రహ్మం, సురేష్ పాల్గొన్నారు.

### ఆకట్టుకున్న అల్లూరి సీతారామరాజు నాటకం



అల్లూరి సీతారామరాజు నాటకంలోని ఓ సన్నివేశం

భీమవరం(ప్రకాశం చౌక్): శ్రీమావుళ్లమ్మవారి 60వ వార్షిక మహోత్సవాల్లో భాగంగా శనివారం సాయంత్రం అమ్మవారి దేవస్థానం వద్ద ప్రదర్శించిన విప్లవ జ్యోతి అల్లూరి సీతారామరాజు నాటకం ప్రేక్షకులను ఆలోచింపజేసింది. శ్రీమావుళ్లమ్మ, సూర్యోదయ ఆర్ట్స్ భీమవరం వారిచే పులగం శివనాగ నర్సింహరావు ఆధ్వర్యంలో ఈ నాటకం ప్రదర్శించారు. తొలుత కోలాటం, భక్తి పాటలు, సినీ మ్యూజికల్ నైట్, భక్తులను అలరించాయి.

### రేపు ఉపాధి పనులపై సమావేశం

పాలకోడేరు: ఉపాధి హామీ పనులపై స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం బహిరంగ సమావేశం నిర్వహించనున్నట్టు ఎంపీడీఓ కె.నాగేంద్ర కుమార్ తెలిపారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో నిర్వహించిన ఉపాధి హామీ పనులపై ఆయా పంచాయతీల్లో చేసిన ఆడిట్ నివేదికలను సమర్పిస్తారని పేర్కొన్నారు.

# సచివాలయాలతో సమస్యలకు చెక్

- సేవల్లో సచివాలయాల ద్వారా ప్రత్యేక మార్క్
- గ్రామస్థాయిలోనే సమస్యలన్నీ పరిష్కారం

యలమంచిలి: ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలన్నీ ప్రజలకు వారి గ్రామాల్లోనే అందించాలనే ఉద్దేశంతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన సచివాలయ వ్యవస్థ ప్రజలకు మెరుగైన సేవలు అందిస్తూ లక్ష్యానికి చేరుకుంది. ప్రభుత్వ అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు పొందడానికి, పిల్లల చదువులకు అవసరమైన సర్టిఫికెట్స్‌తోపాటు ఆధార్ కార్డు మంజూరు, ఆధార్‌లో మార్పులు, చేర్పులు, రైతులకు అవసరమైన రికార్డులు ఈ విధంగా సుమారు 542 రకాల సేవలు సచివాలయంలో అందుతున్నాయి. గతంలో చిన్న ధ్రువపత్రం అవసరమయినా మండల కేంద్రం నుంచి రెవెన్యూ డివిజన్ లేదా జిల్లా కేంద్రం వరకూ తిరిగితే కాని ప్రజలకు ఆ ధ్రువపత్రాలు లభించేవి కావు. ఇప్పుడు ప్రజలు వారు నివసిస్తున్న గ్రామాల్లోనే అన్ని రకాల సర్టిఫికెట్స్ అందుతుండటతో వారి సమయం, డబ్బులు ఆదా కావడమే కాకుండా ప్రయాణ ప్రయాస కూడా తగ్గింది.



యలమంచిలి మండలం మేడపాడు గ్రామ సచివాలయం

**నియోజకవర్గంలో సేవలు ఇలా**

పాలకొల్లు నియోజకవర్గంలో ఉన్న పాలకొలు పట్టణం, మండలం, యలమంచిలి మండలం, పోడూరు మండలాల్లో 67 సచివాలయాలు ఉన్నాయి. వీటి ద్వారా నిత్యం ప్రజలకు సరాసరిన 750 వరకు వివిధ రకాల సేవలు పొందుతున్నారు. చిన్న చిన్న సమస్యలకు మండల, జిల్లా కేంద్రాల చుట్టూ తిరగాల్సిన అవసరం లేకుండానే సమస్యలు పరిష్కారమవుతున్నాయి. ముఖ్యంగా పిల్లల చదువుకు, రైతులకు బ్యాంకు రుణాలకు, మహిళలకు ప్రభుత్వ పథకాల అమలుకు అవసరమైన సర్టిఫికెట్స్‌ను వలంటీర్లే దగ్గరుండి చేయించడం వలన ప్రజలకు సత్వరమే సర్టిఫికెట్స్ అందుతున్నాయి.

**భూమి రిజిస్ట్రేషన్స్ సైతం..**

సమగ్ర భూ సర్వే పూర్తయిన గ్రామాలలో భూమి రికార్డులన్నీ కంప్యూటరీకరణ అయ్యాయి. అలాంటి గ్రామాలలో రైతులు తమ భూములు అమ్మాలన్నా, కొనాలన్నా రిజిస్ట్రార్ ఆఫీసు చుట్టూ తిరగాల్సిన అవసరం లేకుండా సచివాలయంలోనే రిజిస్ట్రేషన్ చేసే వెసులుబాటు కల్పించారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముందు చూపుతో ప్రవేశపెట్టిన సచివాలయ వ్యవస్థ ప్రజలకు సౌకర్యంగా ఉంటుంది.

### ఫిర్యాదులు తగ్గాయి



సచివాలయ వ్యవస్థ వచ్చిన తరువాత మాపై పని భారం, వత్తిడి బాగా తగ్గింది. ముఖ్యంగా ఇంటి పన్ను, భూమి పన్ను వసూలు కూడా సులభతరమైంది. విద్యుత్, టెలిఫోన్ సేవలకు సంబంధించిన రుసుములను సచివాలయాల్లోనే చెల్లిస్తున్నారు. చిన్న చిన్న సమస్యలన్నీ గ్రామాల్లోనే పరిష్కారమవుతున్నాయి. దీంతో స్పందనకు వచ్చే ఫిర్యాదులు భారీగా తగ్గాయి.

– మాతా సునీల్‌కుమార్, తహసీల్దార్, యలమంచిలి

### అన్ని రకాల సర్టిఫికెట్స్ మా దగ్గరే



ప్రజలకు అవసరమైన అన్ని రకాల సర్టిఫికెట్స్ సచివాలయంలోనే మంజూరుచేస్తున్నాం. పైగా లబ్ధిదారులు ఎవరూ మా దగ్గరకు రావాల్సిన అవసరం ఉండదు. వారికి ఏ సర్టిఫికెట్ కావాలో వారి వలంటీర్‌కు చెబితే మీము అప్లికేషన్ వలంటీర్ ద్వారా పంపి సంతకం తీసుకున్న తరువాత అప్‌లై చేసి మంజూరైన వెంటనే వారింటికి సర్టిఫికెట్స్ పంపుతున్నాం.

– షేక్ ఉమర్ ఆలీష, డిజిటల్ అసిస్టెంట్, మేడపాడు

# క్రికెట్ విజేతలకు బహుమతుల అందజేత



దొడ్డిపట్లలో క్రికెట్ టోర్నమెంట్ విజేతలకు బహుమతులు అందిస్తున్న వైఎస్సార్ సీపీ పాలకొల్లు నియోజకవర్గ ఇన్‌చార్జి గుడాల శ్రీహరి గోపాలరావు (గోపి)

యలమంచిలి: సంక్రాంతి సమయంలో యువత జూద క్రీడల వైపుకు వెళ్లకుండా దొడ్డిపట్ల గ్రామంలో వరుసగా 45 ఏళ్లుగా క్రికెట్ టోర్నమెంట్ నిర్వహించడం అభినందనీయమని వైఎస్సార్ సీపీ పాలకొల్లు నియోజకవర్గ ఇన్‌చార్జి గుడాల శ్రీహరి గోపాలరావు (గోపి) అన్నారు. దొడ్డిపట్ల హైస్కూల్‌లో సంక్రాంతి సందర్భంగా నిర్వహించిన టోర్నమెంట్‌ను ఇలపకుర్రు టీమ్ గెలుచుకుంది. విజేతలకు బహుమతులు అందజేసిన గోపి మాట్లాడుతూ క్రీడలను ప్రోత్సాహించాలని ముఖ్యమంత్రి రాష్ట్ర వ్యాప్తంగా ఆడుదాం ఆంధ్ర పోటీలు నిర్వహిస్తున్నారన్నారు. క్రీడల వలన దేహధారుడ్యంతోపాటు ఉపాధి అవకాశాలు మెరుగ్గా ఉంటాయన్నారు. 45 ఏళ్లుగా టోర్నమెంట్ నిర్వహిస్తున్న యువకులను, ప్రోత్సాహక దాతలను ఆయన ప్రశంసించారు. విజేత ఇలపకుర్రు జట్టుకు రూ.20 వేలు, రన్నరప్ దొడ్డిపట్ల జట్టుకు రూ.15 వేలు అందజేశారు. కార్యక్రమంలో మండల జేసీఎస్ కన్వీనర్ ఓదూరి భాస్కరరావు దొడ్డిపట్ల మాజీ ఎంపీటీసీ చేగొండి సూర్య శ్రీనివాస్, నారినమెరక ఎంపీటీసీ ఇసుకపల్లి శ్రీధర్‌వర్మ, వైఎస్సార్ సీపీ నాయకులు కల్యాణం గంగాధరరావు, కానూరి కృష్ణారావు, ఓదూరి బాలు, సిర్రా కిరణ్, లంక చిరంజీవి, కడిమి బాలరాజు, జయరామ్ తదితరులు పాల్గొన్నారు.

# ఉపాధి పనులు పారదర్శకంగా నిర్వహించాలి



ఉపాధి హామీ పథకం సామాజిక తనిఖీ నిర్వహిస్తున్న దృశ్యం

పాలకొల్లు అర్బన్: గ్రామ పంచాయతీల్లో ఉపాధి హామీ పథకంలో సాధ్యమైనంత వరకు ఎక్కువ పనులు చేపట్టి కూలీలకు అధిక పనిదినాలు కల్పించాలని డ్వామా పీడీ ఎస్‌టీవీ రాజేశ్వరరావు సూచించారు. 2022-23 ఆర్థిక సంవత్సరానికి గాను స్థానిక మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో శనివారం నిర్వహించిన సామాజిక తనిఖీల్లో ఆయన పాల్గొని పలు సూచనలు చేశారు. కూలీలకు ఆ గ్రామంలో పనులు లేకపోతే పక్క గ్రామాల్లో పనులు కల్పించి ఉపాధి చూపించే బాధ్యత ఫీల్డ్ అసిస్టెంట్లు తీసుకోవాలని కోరారు. అలాగే కూలీలకు సకాలంలో వేతనాలు ఆన్‌లైన్‌లో కూలీల ఖాతాల్లో జమ అయ్యేందుకు బాధ్యత తీసుకోవాలని కోరారు. ఉపాధి హామీ పథకంలో 943 పనులకు గానూ రూ.3,40,51,338 ఖర్చు చేశారు. వీటిలో వస్తు రూపంలో రూ. 2,11,057, మొత్తం రూ.3,42,62,390 ఖర్చు చేశారు. అలాగే పంచాయితీరాజ్ విభాగంలో 30 పనుల నిమిత్తం రూ.1,46,13,359, సర్వశిక్ష అభియాన్ లో ప్రహరి గోడలు నిర్మాణం నిమిత్తం 4 పనులకు గాను రూ.1,02.679 ఖర్చు చేశారు. 27 గ్రామ పంచాయతీల్లో మొత్తం పనులు 977 పనులు నిర్వహించారు. అలాగే 1,41,880 పని దినాలు ఉపాధి కూలీలకు కల్పించారు. గ్రామ పంచాయతీల పరిధిలో 6 బృందాలు సామాజిక తనిఖీ నిర్వహించినట్లు పీడీ రాజేశ్వరరావు వివరించారు. ఈ పనుల్లో అక్రమాలు చేసినట్లు గుర్తించి రూ. 35,592 రాశారు. రూ. 9 వేలు జరిమానా వేశారు. రూ.27,446 సంబంధించి రికార్డులు సరి చేసుకోమని సూచించారు. ఈ కార్యక్రమంలో ఏపీడీ విజయలక్ష్మి, ఎంపీడీవో సంగాని వెంకటేశ్వరరావు, ఎస్ఆర్‌పీ మన్మధరావు, పంచాయతీ రాజ్ ఏఈ కె.సామ్యూల్, ఏపీఓ వై.శ్రీనివాస్, టెక్నికల్ అసిస్టెంట్ జె జయబాబు, ఈసీ ఎండీ అజరుద్దీన్ పాల్గొన్నారు.

# మౌలిక సదుపాయాల ఏర్పాటుకు అధిక ప్రాధాన్యం



మండలపరిషత్ సమావేశంలో మాట్లాడుతున్న జెడ్పీటీసీ సభ్యుడు బొక్కా రాధాకృష్ణ

నరసాపురం రూరల్: గ్రామాల్లో మౌలిక సదుపాయాల ఏర్పాటుకు రాష్ట్ర ప్రభుత్వం అధిక ప్రాధాన్యతను ఇస్తుందని, అందుకోసం ఇప్పటికే మంజూరైన నిధులను వెంటనే వినియోగించుకోవాలని జెడ్పీటీసీ సభ్యుడు బొక్కా రాధాకృష్ణ అన్నారు. స్థానిక మండలపరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో ఎంపీపీ మైలాబత్తుల సోనీ అధ్యక్షతన శనివారం నిర్వహించిన మండల పరిషత్ సర్వసభ్య సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ వీరభద్రరావుతో కలిసి ఆయా శాఖల వారీగా మండలంలోని గ్రామాల్లో చేపట్టే వివిధ అభివృద్ధి పనులపై శాఖల వారీగా పురోగతిపై సమీక్షించారు. సొంతంగా స్థలం కలిగి ఉండి ఇళ్లు నిర్మించుకున్న లబ్ధిదారులకు గృహ నిర్మాణ శాఖ నుంచి రావాల్సిన సొమ్ములు ఆలస్యం కావడంపై జాప్యం ఎక్కడ జరుగుతుంది? అని జెడ్పీటీసీ రాధాకృష్ణతో పాటు పలువురు సభ్యులు ఆ శాఖ డీఈని వివరణ కోరారు. ఎన్నికల అనంతరం గ్రామాభివృద్ధే ధ్యేయంగా పనిచేయడంలో తూర్పుతాళ్లు ఆదర్శంగా నిలిచిందని, అక్కడి సర్పంచ్, ఎంపీటీసీ సభ్యులు కలిసి రావడంతో వచ్చిన నిధులన్నింటినీ వినియోగించుకుని గ్రామాన్ని అభివృద్ధి పథంలో నిలిపామని ప్రశంసించారు. అందుకు భిన్నంగా పసలదీవి గ్రామం ఉందన్నారు. అక్కడ చేపట్టే అభివృద్ధి పనులకు పంచాయతీ నుంచి తీర్మానాలు ఇవ్వకపోవడంతో పలు అభివృద్ధి పనులకు ఆటంకంగా మారిందన్నారు. ప్రభుత్వం నుంచి గ్రాంటులు మంజూరై ఇంకా పనులు చేపట్టకుండా ఉన్న పనులను ఈ నెలాఖరులోపు పూర్తి చేసుకోవాలని సూచించారు. ఏపీఎం పద్మ మాట్లాడుతూ ఈ నెల 23న 4వ విడత ఆసరా మొత్తాన్ని మండలంలోని 1,580 గ్రూపులకు సంబంధించి రూ.630 కోట్లు జమ కానున్నాయని వివరించారు. ఈ సమావేశంలో వైస్ ఎంపీపీ ఉంగరాల రమేష్‌నాయుడు, ఎంపీటీసీ సభ్యులు చిన్నం వెంకట్రావు, కోలపర్తి రామకృష్ణ, మల్లుల సత్యనారాయణ, నక్కా లక్ష్మీనారాయణ, సర్పంచ్‌లు కైల లావణ్య, నల్లి వరలక్ష్మీజేమ్స్ తదితరులు పాల్గొన్నారు.

# వైఎస్సార్ బీమాతో పేద కుటుంబాలకు ధీమా



దిగమర్రులో వైఎస్సార్ బీమా చెక్కు అందజేస్తున్న సర్పంచ్ రాపాక నగేష్ కరుణాకర్

పాలకొల్లు అర్బన్: వైఎస్సార్ బీమా పథకంలో ప్రతి కుటుంబానికీ ఇన్సూరెన్స్ సౌకర్యం కల్పించడం వల్ల పేదలకు ఆర్థిక ధీమాను సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కల్పించారని సర్పంచ్ రాపాక నగేష్ కరుణాకర్ చెప్పారు. పాలకొల్లు మండలం దిగమర్రుకి చెందిన పాలపర్తి రమేష్, జిడ్డు రమేష్‌లు ప్రమాదవశాత్తూ మృతి చెందారు. వీరికి వైఎస్సార్ బీమా సౌకర్యం కల్పించడంతో పాలపర్తి వాణి, జిడ్డు లక్ష్మీ ప్రియాంకలకు ఒక్కొక్కరికి రూ.4,90,000 చెక్కు రూపంలో శనివారం అందజేశారు. మట్టి ఖర్చుల నిమిత్తం వీరికి ఒక్కొక్కరికి రూ.10 వేలు చెప్పున నగదు అందజేశారు. పంచాయతీ కార్యదర్శి ఓదూరి సూర్యప్రకాశరావు (రాజా), వెల్ఫేర్ అసిస్టెంట్ లోకేష్, వార్డు సభ్యులు, వలంటీర్లు పాల్గొన్నారు.

# ఆక్వా రైతులకు న్యాయం చేయాలి



తహసీల్దార్‌కు వినతిపత్రం అందిస్తున్న ఆక్వా రైతులు

పాలకొల్లు సెంట్రల్: ఆక్వా రైతులకు సంబంధించి హేచరీస్, ప్రాసెసింగ్ యూనిట్లు, ఫీడ్ ప్లాంట్లు నిర్ణయిస్తున్న ధరలపై ప్రభుత్వం తగిన చర్యలు తీసుకుని ఆక్వా రైతులకు న్యాయం చేయాలని జై భారత్ క్షీరా రామ ఆక్వా రైతు సంఘం ఆధ్వర్యంలో పట్టణంలో 2కే ర్యాలీ నిర్వహించారు. శనివారం పూలపల్లి ఆక్వా రైతు సంఘం భవనం నుంచి పట్టణంలో ర్యాలీ నిర్వహించి తహసీల్దార్‌కు, ఫిషరీస్ అధికారికి వినతిపత్రాలు అందజేశారు. సంఘ అధ్యక్షులు గొట్టుముక్కల గాంధీభగవాన్ రాజు మాట్లాడుతూ ప్రభుత్వం అప్సాా సంఘం ఏర్పాటుచేసి వైస్ చైర్మన్ వడ్డి రఘురామ్ ఆధ్వర్యంలో గత సంవత్సరం జులై 30న కాకినాడలో ఆక్వా రైతులు సమక్షంలో హేచరీస్, ప్రోసెసింగ్ ప్లాంట్లు, ఫీడ్ ప్లాంట్లు యాజమాన్యంతో సమావేశం ఏర్పాటు చేసి రైతుల సమస్యలను వారికి వివరించి రైతులకు సమస్యలు లేకుండా నడుచుకోవాలని సూచనలు చేశారు. కానీ ప్రభుత్వం చెప్పిన తరువాత కూడా ఆయా సంస్థల యాజమాన్యం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నాయని తమ సమస్యను పూర్తి పరిష్కారం దిశగా ప్రభుత్వం చర్యలు చేపట్టాలని కోరారు. నిత్యం ఆక్వా పంట వల్ల భూమిలో సారవంతం తగ్గిపోతుందని కనీసం భూమి ఆరుదల జరిగేలా క్రాప్ హాలిడే ప్రకటిస్తే భూమిలో సారవంతం పెరుగుతుందని అన్నారు. ఆ క్రాఫ్ హాలిడే ఏ నెలలో ప్రకటిస్తే మంచిదనే విషయంపై సమాలోచనలు చేస్తున్నామన్నారు. అలాగే ప్రభుత్వం ఆక్వా రైతులకు విద్యుత్ సబ్సిడీ ఇస్తుందని ఆ సబ్సిడీ మొత్తం రైతులందరికీ అందేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలన్నారు.

### నేడు పాలకొల్లులో శోభాయాత్ర

పాలకొల్లు సెంట్రల్: అయోధ్యలో సోమవారం బాల రాముని విగ్రహం ప్రాణ ప్రతిష్ఠ చేస్తున్న సందర్భంగా ఆదివారం పాలకొల్లు పట్టణంలో శోభయాత్ర నిర్వహించనున్నట్లు పట్టణ శ్రీ క్షీరారామలింగేశ్వరస్వామి సేవా సమితి అధ్యక్షులు శీరం ఆనందకృష్ణ తెలిపారు. మధ్యాహ్నం 3 గంటలకు క్షీరారామలింగేశ్వర స్వామి సేవా సమితి ఆధ్వర్యంలో శ్రీ క్షీరారామలింగేశ్వరస్వామి (పెదగోపురం) ఆలయం నుంచి ఈ శోభాయాత్ర ప్రారంభమవుతుందన్నారు. పట్టణంలో ఉన్న వివిధ ఆలయాల కమిటీ సభ్యులతో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొనాలని కోరారు.



# ప్రతిభను వెలికితీసేందుకు క్రీడలు దోహదం



నరసాపురం రూరల్: తూర్పుతాళ్లులో ఆకట్టుకున్న వాలీబాల్ పోటీలు



నరసాపురం రూరల్: నియోజకవర్గ స్థాయికి ఎంపికైన జట్లను అభినందిస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ బర్రి శ్రీవెంకటరమణ

నరసాపురం రూరల్: యువతలో ఉన్న ప్రతిభను వెలికి తీసేందుకు క్రీడలు ఎంతగా దోహదపడతాయని నరసాపురం మున్సిపల్ చైర్‌పర్సన్ బర్రి శ్రీవెంకటరమణ పేర్కొన్నారు. ఆడుదాం ఆంధ్ర మండలస్థాయి క్రీడా పోటీలను నరసాపురం పట్టణంలో జరిగిన వివిధ పోటీల్లో విజయాన్ని కైవసం చేసుకున్న క్రీడాకారులను శనివారం ఆమె అభినందించారు. మండలస్థాయిలో గెలుపొందిన క్రీడాకారులు నియోజకవర్గ స్థాయి పోటీల్లో ఆడుతారన్నారు. అలాగే మండలంలోని తూర్పుతాళ్లు ఉన్నత పాఠశాలలో నిర్వహించిన వాలీబాల్ పోటీల్లో వేములదీవి ఈస్ట్, ఎల్బీచర్ల టీంలు హోరా హోరీగా తలపడ్డాయి. ఈ పోటీల్లో వేములదీవి ఈస్ట్ టీం మొదటి స్థానంలో నిలిచింది. కార్యక్రమంలో వ్యాయామ ఉపాధ్యాయులు అడపా రామకృష్ణ, కె కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

**ఆడుదాం ఆంధ్రాతో యువతకు ప్రోత్సాహం**

పెనుగొండ: రాష్ట్రంలో ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న ఆడుదాం ఆంధ్ర పోటీలు యువతకు ప్రోత్సాహంగా ఉంటాయని పెనుగొండ ఎంపీడీవో ఎస్ శ్రీనివాస దొర అన్నారు. పెనుగొండ ఎస్వీకేపీ కళాశాలలో నిర్వహిస్తున్న ఆడుదాం ఆంధ్ర మండల స్థాయి పోటీల్లో శనివారం పెనుగొండ-02, పెనుగొండ -03 జట్లు మధ్య నిర్వహించిన క్రికెట్ పోటీల్లో పెనుగొండ-03 జట్టు విజయం సాధించి విజేతగా నిలిచింది. త్వరలో నిర్వహించబోయే నియోజకవర్గ స్థాయి పోటీల్లో పెనుగొండ 03 మండల జట్టుగా పాల్గొననుంది. కార్యక్రమంలో కార్యదర్శి శ్యామలా సంధ్యారాణి ఏఓ శర్మ, ఏఈ పీఆర్ ఏడుకొండలు, రాజేష్, కుసుమ, దివ్య వాసు దేవి తదితరులు పాల్గొన్నారు.



### మహిళా చట్టాలపై అవగాహన అవసరం

భీమవరం: మహిళా చట్టాలపై ప్రతి ఒక్కరికీ అవగాహన ఉండాలని మూడో అదనపు న్యాయమూర్తి పి.శ్రీ సత్యాదేవి అన్నారు. మహిళలపై లైంగిక వేధింపుల నిరోధక చట్టంపై శనివారం భీమవరం కోర్టు సమావేశ మందిరంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా విచ్చేసిన శ్రీసత్యాదేవి మాట్లాడుతూ లైంగిక వేధింపుల నిరోధక చట్టాలపై ప్రతి మహిళకు అవగాహన కలిగి ఉండాలన్నారు. హక్కులపై పూర్తిస్థాయిలో అవగాహన ఉన్నపుడే ఆత్మస్థైర్యం, సమస్యను ఎదుర్కొగలమన్న ధీమా ఉంటుందని చెప్పారు. జిల్లాలో మహిళలు, బాలికల హక్కులపై ఐసీడీఎస్ శాఖ, అనేక సంస్థలు అవగాహన కల్పిస్తున్నట్టు తెలిపారు. నిందితుడిపై తీసుకున్న చర్యలు మీడియా ద్వారా ప్రచారం చేసినప్పుడే వారికి భయం ఉంటుందని అన్నారు. మహిళలపై లైంగిక వేధింపులకు పాల్పడితే పడే శిక్షలు, ట్రోల్ ఫ్రీ నెంబరు బోర్డులు ప్రదర్శించాలని సూచించారు. సమావేశంలో న్యాయమూర్తులు బి.అప్పలస్వామి, ఎ.పవన్ కుమార్, జి.సురేష్ బాబు, డి.ధనరాజు, బార్ అసోసియేషన్ ప్రెసిడెంట్ ఎంవీ రమణారావు పాల్గొన్నారు.

# అభివృద్ధిలో ఆదర్శంగా భీమవరం



సీసీ రోడ్డును ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్

భీమవరం (ప్రకాశంచౌక్): అభివృద్ధిలో భీమవరం నియోజకవర్గాన్ని రాష్ట్ర స్థాయిలోనే ఆదర్శవంతంగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తున్నానని రాష్ట్ర ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ అన్నారు. భీమవరంలో నిర్మించిన పలు రోడ్లను శనివారం ఆయన ప్రారంభించారు. 34వ వార్డులో రూ.20.50 లక్షలతో సీత టవర్స్ నుంచి గోపీకృష్ణ టవర్ వరకు, ఎస్ఆర్‌కేఆర్ రోడ్డు నుంచి ఏఎస్ఆర్ కల్యాణ మండపం వరకు నిర్మించిన బీటీ రోడ్డును, 35వ వార్డులో రూ.19.50 లక్షలతో ఆదర్శనగర్ రెండో వీధి నుంచి వంశీకృష్ణ నగర్‌లోని కాస్మో క్లబ్ వెనుక వరకు నిర్మించిన సీసీ రోడ్డును ఆయన ప్రారంభించారు. 35వ వార్డులో రూ.29.50 లక్షల నిధులతో ఉండి రోడ్డు నుంచి వీఎస్ఎస్ గార్డెన్స్ వరకు నిర్మించిన బీటీ రోడ్డును, 36వ వార్డులో రూ.10.50 లక్షలతో సత్యవతి నగర్ టౌన్ స్టేషన్ కాంపౌండ్ వాల్ నుంచి ఎలక్ట్రికల్ సబ్‌స్టేషన్ వరకు నిర్మించిన సీసీ రోడ్డును, 37వ వార్డులో రూ.23.50 లక్షలతో నిర్మించిన బీటీ రోడ్డును ప్రారంభించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ గత నాలుగున్నర ఏళ్లుగా భీమవరం పట్టణాన్ని, నియోజకవర్గాన్ని ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో అన్ని విధాలుగా అభివృద్ధి చేస్తున్నామని చెప్పారు. 15 వేల మందికి పైనే ఇళ్ల స్థల పట్టాలను అందించామన్నారు. భీమవరం పట్టణంలో ఇప్పటి వరకు దాదాపుగా రూ.100 కోట్లకుపైగా అభివృద్ధి పనులు చేశామన్నారు. దివంగత సీఎం వైఎస్ రాజశేఖరరెడ్డి హయాంలో తాను భీమవరంలో 100 పడకల ఆసుపత్రి కోసం ప్రతిపాదనలు చేశానని, నేడు ఆయన తనయుడు సీఎం జగన్ ఆధ్వర్యంలో నాలుగు ఎకరాల్లో 100 పడకల ఆసుపత్రి నిర్మాణం చేపట్టామని తెలిపారు. యనమదుర్రు డ్రెయిన్‌పై నిరుపయోగంగా ఉన్న వంతెనలకు అప్రోచ్ రోడ్ల నిర్మాణానికి రూ.36 కోట్లు మంజూరు చేయించామని, ప్రస్తుతం టెండర్ ప్రక్రియ కొనసాగుతుందని, త్వరలోనే పనులు ప్రారంభిస్తామని చెప్పారు. కంపోస్ట్ యార్డుకు ఆరున్నర ఎకరాల భూ సేకరణతోపాటు అక్కడికి వెళ్లేందుకు రోడ్డు నిర్మాణానికీ చర్యలు తీసుకున్నట్టు తెలిపారు. ఈ కార్యక్రమాల్లో ఎంపీపీ పేరిచర్ల విజయ నర్సింహరాజు, మున్సిపల్ కమిషనర్ ఎం శ్యామల, రాష్ట్ర గౌడ కార్పొరేషన్ డైరెక్టర్ కామన నాగేశ్వరరావు, గాదిరాజు సుబ్రహ్మణ్యరాజు పాల్గొన్నారు.